సాక్షి పల్నాడు

ఆదివారం | 2 | ఏప్రిల్ | 2023



సుప్రీం జడ్జికి విజయేంద్ర సరస్వతి ఆశీస్సులు


తెనాలిరూరల్: సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పి.రామ సుబ్రహ్మణ్యం దంపతులు పెదరావూరులో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులు పొందారు.



కొండపల్లి పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.పద్మావతి శనివారం తెలిపారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



న్యూస్‌రీల్

కారెంపూడిలో వర్షం



కారెంపూడి: మండలంలో శనివారం మధ్యాహ్నం గంట పాటు ఈదురు గాలులతో కూడా భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వర్షం కురిసింది. దీంతో కల్లాలలో మిర్చి ఎండ బెట్టిన రైతులు వాటిపై పట్టాలు కప్పేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. గంట తర్వాత ఎండ బాగా కాయడంతో పట్టాలు తొలగించి కాయలు ఆర బెట్టారు. ఇదిలా ఉంటే శుక్రవారం కూడా మధ్యాహ్నం వర్షం పడింది. దీంతో వివిధ పనులు చేస్తున్న కూలీలు ఇంటి బాట పట్టారు. మిర్చి కోతల పనులకు విఘాతం కలిగింది. బాగా ఎండ కాయడం, అకస్మాత్తుగా వాతావరణం చల్లబడి వర్షాలు పడడం లాంటి విచిత్ర వాతావరణం ఈ ప్రాంతంలో కనిపించింది.

సాంకేతిక సమస్యతో నిలిచిన తిరుపతి రైలు



శావల్యాపురం: పల్నాడు జిల్లా శావల్యాపురం కొంకెరు వాగు వంతెన సమీపాన గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే రైలు (17261) శనివారం సాయంత్రం 45 నిమిషాలపాటు నిలిచిపోయింది. అందిన సమాచారం మేరకు సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో రైలు నిలిచిపోయింది. రైల్వే ఇంజినీర్లు సమస్యను సరిదిద్దడంతో రైలు బయలుదేరింది.

నేడు యడ్లపాడుకు సినీ ప్రముఖుల రాక



మాట్లాడుతున్న ఎం.సురేష్‌బాబు

యడ్లపాడు: పల్నాడు జిల్లా మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామానికి కేరళ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మళయాళ సినీ దర్శకుడు షాజీనీల కంఠన్ తరుణ్, తెలుగు చలన చిత్ర దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు ఆదివారం విచ్చేయనున్నారు. తెలుగు నాటకరంగం స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు వీరు వస్తున్నట్లు పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాల కమిటీ సభ్యుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. ఈ అధ్యయనంలో భూత, వర్తమాన కాలల్లో రంగస్థల నిర్వహణ, కాలక్రమేణ వచ్చిన మార్పులు, సుందరయ్య పేరిట పరిషత్ పోటీల నిర్వహణ తీరుతెన్నులు, కళారంగాలు, కళాభిమానుల మనోభావాలు, నాటక రంగంపై నాటి-నేటి ఆదరణ, రంగస్థలంపై సమాజ ప్రభావం తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో విశ్లేషించి ఇక్కడ కొనసాగుతున్న అంశాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఆయా విధానాలను తమ రాష్ట్రంలోని నాటక రంగంలో ప్రవేశపెట్టేందుకు అనుకూలత కలిగిన అంశాలను గుర్తించేందుకు వస్తున్నట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,600, మోడల్ ధర రూ.5,200 వరకు పలికింది.

చారిత్రాత్మక పథకానికి వేదిక

- ఇప్పటికే విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్
- ఈ నెల 6న లింగంగుంట్లలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం
- చురుగ్గా హెలిప్యాడ్ స్థలం, సభా ప్రాంగణం ఏర్పాట్లు
- పరిశీలించిన మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచనలు



సభా ప్రాంగణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి

చిలకలూరిపేట: చారిత్రాత్మక ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని చిలకలూరిపేట నుంచి ప్రారంభిస్తుండటం తమకు ఎంతో గర్వకారణమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో ఈ నెల 6వ తేదీన అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి విడదల రజిని శనివారం పరిశీలించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ ప్రోగ్రామ్స్ కమిటీ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మరో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈఓ హరీంద్రప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ముందుగా మంత్రి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ముఖ్యమంత్రి సందర్శించనున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. అనంతరం హెలిప్యాడ్ ప్రాంతం, సభా ప్రాంగణం, స్టాళ్లు ఏర్పాటు చేసే ప్రదేశాలను సందర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ సమీపంలోనే సభా ప్రాంగణాన్ని ఖరారు చేశారు. అనంతరం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక రైతు భరోసా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అధికారులకు సూచనలు...

సమీక్ష సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారని, ఎవరికీ ఏ ఇబ్బంది తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. సభా ప్రాంగణాన్ని చదును చేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ లాంటి ఒక గొప్ప కార్యక్రమం ప్రారంభోత్సవానికి చిలకలూరిపేట వేదిక కావడం తమ అదృష్టమని పేర్కొన్నారు. సీఎం రాక సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన స్టాళ్లకు సంబంధించి ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా భోజన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిలో కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఆ మార్గంలో వాహనాల రాకపోకలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఎస్పీ విజయ భాస్కర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

డీఈఓ. శామ్యూల్



నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ తెలిపారు. అరండల్‌పేటలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18 వరకు రోజు మార్చిరోజు పరీక్షలు జరుగుతాయన్నారు. అధికారుల సహకారంతో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించినట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్‌లలో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు పంపాలని కోరారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సోమవారం నుంచి ఒక్కపూటే తరగతులు నిర్వహించాలని ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని పేర్కొన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌ఏ-2 పరీక్షల షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులు లేవని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టిన తరువాతే ఇళ్లకు పంపాలని హెచ్‌ఎంలకు సూచించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు పరీక్షలు జరిగే ఆరు రోజులు పూర్తిగా సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు.

గ్రామాల్లోనే పంట ఉత్పత్తులకు 'భరోసా'

- రైతుభరోసా కేంద్రాల ద్వారా పంట కొనుగోలు
- దళారులకు అమ్మి నష్టపోవద్దు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి ఏఎంసీలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రైతులు కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం అందించిన మద్దతు ధరకు విక్రయించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి మద్దతు ధర, ప్రకృతి విపత్తుల సమయం లోనూ పరిహారం, ఇతర ప్రభుత్వ రాయితీలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా దళారుల వ్యవస్థను నిర్మూలించవచ్చన్నారు. వ్యవసాయాన్ని పరిపుష్టి చేసేందుకు, రైతుల ఇంటి ముంగిటకే సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, వీటి ద్వారా పండించిన పంట ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. రైతుభరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా గ్రామాల్లో ధర లభిస్తే అక్కడే ఆ ఉత్పత్తులను అమ్ముకోవాలని సూచించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, కమిటీ సభ్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబూన్ బీ, ఏఎంసీ వైస్ చైర్మన్ శివరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

టీడీపీ బంద్‌కు స్పందన శూన్యం



శనివారం ఉదయం మార్కెట్ సెంటర్‌లో తెరిచిన దుకాణాలు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉదయం నుంచే తెరుచుకున్న ఎక్కువ శాతం దుకాణాలు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్‌లో జరిగిన ఘటనలకు నిరసనగా టీడీపీ నాయకులు శనివారం చేపట్టిన తెనాలి పట్టణ బంద్ విఫలమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను శనివారం ఉదయం నుంచే తెరిచారు. టీడీపీ నాయకులు కొందరు పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో తిరుగుతూ దుకాణాలు మూయించినప్పటికీ కొద్దిసేపటికే వ్యాపారులు వాటిని తెరిచారు. ఇదిలా ఉంటే వైఎస్సార్ సీపీ నాయకులు తమ కౌన్సిలర్‌పై జరిగిన దాడికి నిరసనగా చేపట్టిన ర్యాలీని కూడా పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం జరిగిన తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ నాయకులు పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లను రెచ్చగొట్టి పరస్పర దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. ఘటనను ఒక సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్‌పై జరిగిన దాడిగా టీడీపీ చిత్రీకరించి బంద్‌కు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం టీడీపీ నాయకులు కొందరు పట్టణంలో ర్యాలీగా వెళ్తూ కొన్ని దుకాణాలను మూయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ర్యాలీకి ఎటువంటి అనుమతులు లేవని వెంటనే దీనిని ఆపాలని కోరారు. దానికి వారు అంగీకరించకపోవటంతో కొత్తవంతెన వద్ద వారిని ఆపారు. వారు వైఎస్సార్ సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు అక్కడే సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేశారు. చేసేదిలేక పోలీసులు వారిలో కొందరిని ప్రత్యేక వాహనాలలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్ది గంటల తర్వాత వారిని సొంత పూచీకత్తుపై వదిలివేయటంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిఇలా ఉంటే తమ కౌన్సిలర్‌లపై జరిగిన దాడికి నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీని నిర్వహించారు. మార్కెట్ మీదుగా కొత్తవంతెన వద్దకు వచ్చారు. వంతెన కింద టీడీపీ నాయకులు ఉండటంతో పోలీసులు వీరిని అడ్డుకున్నారు. ర్యాలీకి ఎటువంటి అనుమతులు లేని కారణంగా వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ కౌన్సిలర్‌లు తమ కౌన్సిలర్‌లను రెచ్చగొట్టి గొడవలు సృష్టించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు కావాలని దానిని కులాలకు ఆపాదించి రాజకీయ లబ్ధిని పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనిని గమనించిన వ్యాపారులు బంద్‌కు సహకరించకుండా తమ దుకాణాలు తెరిచి వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి కుల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, దుబాయ్ బాబులు మాట్లాడుతూ ఇద్దరు కౌన్సిలర్‌ల మధ్య జరిగిన గొడవను కులాలకు ఆపాదించి కుల, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించటం సిగ్గుచేటన్నారు.

నిస్సహాయులపై వాత్సల్యం

- 18 ఏళ్లలోపు చిన్నారులు అర్హులు
- నెలకు రూ.4 వేలు చొప్పున సహాయం
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వరకు గడువు
- సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



భట్లూరులో పిల్లల వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

సత్తెనపల్లి: విధి వంచితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపడుతుంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు ఆర్థిక చేయుత అందించనుంది. ఈ నేపథ్యంలో 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్‌షిప్ కల్పిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.2,400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.1,600 ఇస్తుంది. నిరుపేద, నిరాధరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు.

వీరు దరఖాస్తు చేసుకోవచ్చు...

జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధిబారిన పడినా, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం -2015 ప్రకారం ఇల్లులేని పిల్లలకు ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్యవివాహ బాధితులు, హెచ్‌ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా వారి అభివృద్ధికి ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

వార్షికాదాయ పరిమితి...

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతిగృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపి వేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లేవారు పాఠశాల హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా పరిశీలించి తాత్కాలికంగా నిలిపి వేస్తారు.

ఈ నెల 5వరకు దరఖాస్తు చేసుకోవచ్చు...

గత ఏడాదికి సంబంధించి పల్నాడు జిల్లా వ్యాప్తంగా 40 మంది పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున 7 నెలల కాలానికి రూ.11.20 లక్షలు పిల్లలు, సంరక్షకుల ఖాతాలకు జమ చేశారు. 2023 ఏప్రిల్ నుంచి ఇంకా గత ఏడాదిలో చేరని పిల్లల వివరాలను సేకరించేందుకు అన్ని మండలాల్లోని మహిళ, శిశు సంక్షేమ అధికారి (సీడీపీఓ)లకు బాధ్యత అప్పగించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ఈ సేకరణ జరుగుతుంది. చైర్‌పర్సన్‌గా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మహిళ, శిశుసంక్షేమ సాధికారిత అధికారి, ఎస్‌ఐసీపీఓ అధికారి, శిశు గృహ సంక్షేమ అధికారి, ఒక ఎన్‌జీఓ అధికారి సభ్యుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక విధానం జరుగుతుంది.

దరఖాస్తు పరిశీలన ఇలా..

సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నిటినీ మండలస్థాయి స్క్రూటినీ కమిటీ (తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) మీటింగ్‌లో దరఖాస్తులను నిశితంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత సదరు మీటింగ్ మినిట్స్‌తో పాటు దరఖాస్తులన్నింటిని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయానికి పంపుతారు. ప్రస్తుతం ఈ నెల 5వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేశాం. వారి నుంచి వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపుతాం.

-బి.అరుణ, మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి, పల్నాడుజిల్లా

దరఖాస్తుకు జత చేయవలసిన పత్రాలు

- బాలుడి/ బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి ఆధార్ కార్డు
- తండ్రి ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణ కారణం
- గార్డియన్ ఆధార్
- రేషన్ కార్డు
- కులధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బ్యాంక్ అకౌంట్ వివరాలు బాలుడు, లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేక తల్లి, తండ్రి, సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్.

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు

- రెండోరోజు కొనసాగిన పోటీలు
- కిక్కిరిసిన కళా ప్రాంగణం
- పోటాపోటీగా మూడు ప్రదర్శనలు
- ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకున్న కొత్త కథలు



ప్రక్షాళన నాటికలోని కీలక సన్నివేశం

యడ్లపాడు: కమ్యూనిస్ట్ గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సుందరయ్య కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నాటికల పోటీలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. కళా ప్రాంగణమంతా కళాభిమానులతో నిండిపోయింది. ప్రదర్శితమైన మూడు నాటికల్లో స్త్రీ హక్కులు, వారిపై జరిగే వేధింపులు, కథనాలకు దృశ్య కావ్యాలై నిలిచాయి. ప్రతి ప్రదర్శన ప్రేక్షకుల్ని రంజింపజేయడమే కాకుండా ఆలోచింపచేశాయి. కార్యక్రమాలను కమిటీ సభ్యులు ముత్తవరపు సురేష్‌బాబు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

అహం..అపార్థం వల్ల అనర్థాలను తెలిపే 'కపిరాజు'

అహంకారం..అధికారం అన్నదమ్ముల మధ్య చిచ్చు రాజేసిన వైనం..రామాయణంలోని రావణ-విభీషణ, వాలీ-సుగ్రీవులే నిదర్శనం. వీరి ఖర్మలు వీరిని భ్రష్టుపట్టిస్తే..అహంకారం, అధికారం విడిచిన అడవుల పాలైన అన్నదమ్ములు రామలక్ష్మణుల ధర్మం వారిని భగవంతుల్ని చేసింది. అహం..అపార్థం ఎంతటి పతనానికి దారి తీస్తుందో రుజువు చేసే ఆయా కథల స్ఫూర్తితో మలచిన నాటిక 'కపిరాజు' ఇతివృత్తం. న్యూస్టార్ మోడరన్ ఆర్ట్ థియేటర్ (విజయవాడ) వారి నాటికను సమర్పించారు. డాక్టర్ ఎంఎస్ చౌదరి రచనకు పి దివాకర్‌ఫణీంద్ర దర్శకత్వం వహించారు.

సమాజంలోని చెడును 'ప్రక్షాళన' చేయడమే లక్ష్యం

నేడు సాంకేతిక విప్లవం ప్రజ్వరిల్లుతోంది. టెక్నాలజీ మత్తులో యువత చిత్తవుతుంది. ఆధునికం..సాంకేతికం..పాశ్చాత్యంపై మోజులో పడి భారత సంస్కృతి-సంప్రదాయాలే కాదు మనిషి నైతిక విలువల్ని సైతం విస్మరిస్తున్నారు. వాటి ఫలితంగా నేడు ఆడవాళ్లపై వేధింపులు, అత్యాచారాలు, హత్యలు అధికమై ఎందరో అబలల జీవితాలు ఛిద్రమవుతున్న వాస్తవ ఘటనల దృశ్య రూపం 'ప్రక్షాళన' ఇతివృత్తం. అమ్మాయిల జీవితాలతో ఆటలాడే వారిని సభ్యసమాజం నుంచి కలుపు మొక్కల్లా తొలగించే రంగం సిద్ధమైందంటూ యువతను హెచ్చరించే ప్రదర్శన ఇది. చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించగా ఉషోదయ కళానికేతన్(కట్రపాడు) వారు సమర్పించారు.

స్త్రీ శరీరంపై తనకే సంపూర్ణ హక్కులని చాటే 'వెండిఅంచులు' నాటిక..

రాజ్యాంగం ప్రతి మనిషికి స్వేచ్ఛాయుత హక్కుల్ని కల్పించింది. లింగబేధం లేకుండా స్త్రీ, పురుషులకు సమానంగా ఇది వర్తిస్తుంది. పురుషునితోపాటు స్త్రీ శరీరంపై తనకు సంపూర్ణ హక్కు కలిగి ఉంటుంది. సృష్టికారిణి స్త్రీ పునరుత్పత్తి హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదు. గర్భస్రావం విషయంలో అంతిమ నిర్ణయం ఆమెదై ఉండాలని..ఆమె హక్కుల్ని హరించడం అమానవీయం..క్షమించరాని నేరం అని ధర్మాసనం స్పష్టం చేసిన అంశాలతో కనివిప్పు కలిగించే కళారూపమే...'వెండిఅంచులు'. అరవిందా ఆర్ట్స్ (తాడేపల్లి) వారు సమర్పించిన ఈ నాటిక శ్రీసత్యవతి మూలకథ కాగా, వల్లూరి శివప్రసాదరావు నాటకీకరణ చేసి గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు.

నేటి కార్యక్రమాలు..

జాతీయస్థాయి నాటికల పోటీల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించే నాటికల వివరాలు..

-రాత్రి..8.00 గంటలకు రసఝరి నిడుబ్రోలు(పొన్నూరు) వారి 'కాపలా' నాటిక.

9.15 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్ (కొలకలూరు) వారి 'ప్రేమతో నాన్న' నాటిక.

10.30 గంటలకు పండు క్రియేషన్స్ (కొప్పోలు) వారి 'పక్కింటి మొగుడు' నాటిక.

11.30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనగా కాంత్రి క్రియేషన్స్ (హైదరాబాద్) వారి 'వేలిమీద సిరా చుక్క'.

గ్రంథాలయాలకు తోడ్పాటు అభినందనీయం

జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాదు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



గ్రంథాలయంలో పుస్తకాల నూతన ర్యాక్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకొచ్చి తోడ్పాటు అందజేయటం ఎంతో గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యాన శనివారం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన విజిట్ టు లైబ్రరీ-2 కార్యక్రమానికి వీరు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ పితామహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాతలు అందజేసిన పుస్తకాల ర్యాక్‌లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షతన లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలు వెలకట్టలేనివని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకొని భవిష్యత్ జీవితానికి పునాది వేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ లైబ్రరీ అభివృద్ధికి రూ.25,000 విరాళంగా ఇచ్చిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విద్యావేత్త, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం.స్వామి మాస్టర్ రూ.10వేలు ఖరీదు చేసే పుస్తకాలను విరాళంగా ఇచ్చినందుకు అభినందించారు. గ్రంథాలయానికి సహాయ సహకారాలు అందజేస్తున్న షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, పడవల మల్లికార్జునరావు, ఓ.ఝాన్సీలక్ష్మి, పాపిరెడ్డి, శారద, స్వర్ణ పాండురంగారెడ్డి, నరసింహారావు, డాక్టర్ శివబాబు, ఏ.సాయికార్తీక్, రాధాకృష్ణ (లండన్) ఎమ్మెల్యే ప్రశంసించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ తమ గ్రంథాలయాలకు స్వర్ణ రామిరెడ్డి మంచి అండ దండ అన్నారు. విద్యార్థులకు డిబేట్ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘ సభ్యులు వేముల శివ, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల గుంటూరు సెక్రటరీ కె.ఝాన్సీలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్స్ ట్రోఫీ బ్యాడ్మింటన్ విజేతలు



నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా అవతరణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలలో శనివారం బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం ఉద్యోగ విధులలో నిమగ్నమవుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తి విధుల నిర్వహణలోనూ, కుటుంబ జీవనంలోనూ వ్యక్తిగత అభ్యున్నతికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి ఆఫీసర్స్ విభాగంలో బి.బాలునాయక్(డీఆర్‌డీఏ, పీడీ), జి.జోసఫ్‌కుమార్(డ్వామా, పీడీ) ప్రథమస్థానం, కె.సూర్యప్రకాష్‌రెడ్డి, ఐ.మురళీ (జిల్లా వ్యవసాయాధికారి) ద్వితీయ స్థానం సాధించారు. నాన్ ఆఫీసర్స్ విభాగంలో సీహెచ్.కోటేశ్వరరావు, బి.రవికుమార్ ప్రథమ, ఎన్.గోపికృష్ణ, కె.కోటిసూర్యనారాయణ ద్వితీయ స్థానం సాధించారు. పోటీలను జిల్లా చీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు, స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి చప్పిడి కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌మస్తాన్, విక్రమ్‌సింగ్ పర్యవేక్షించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేటటౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. బాలయ్యనగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న రామును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్లరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆది మల్లికార్జునరావు నాయకత్వంలో 20 కుటుంబాలు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే సాదరంగా ఆహ్వానించి కండువాలు కప్పారు. అనంతరం పార్టీలో చేరిన వారంతా పీఆర్కేను ఎంపీపీ బూడిద శ్రీను, పార్టీ మండల కన్వీనర్ నోముల కృష్ణ, గ్రామ నాయకులు తిప్పారెడ్డి గోపాలరెడ్డి, గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో సన్మానించారు. పీఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారంతా వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారన్నారు. ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీకి ఆదరణ లభిస్తుందన్నారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ముక్కాల లింగయ్య, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, గుండెబోయిన వీరయ్య, రామాంజి, మల్లయ్య, గోవిందు, ప్రభుదాసు, పెద్ద రామాంజనేయులు, ఊరే శ్రీను, చీరబోయిన శ్రీను, గోపి, బ్రహ్మయ్య, సాయి, ముక్కాల కృష్ణయ్య, శ్రీను, లింగయ్య, జల్లెల అంజి, కొండ, శివశంకర్‌లు పార్టీలో చేరారని తెలిపారు. ప్రతి ఒక్కరినీ ఆదరిస్తానని, న్యాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, జిల్లా నాయకులు పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలు టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికి పీఆర్కే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన పేరుపోగు పావులు, పేరుపోగు ప్రభాకర్, పేరుపోగు శేఖర్, పాలెపోగు ఏసుదాసు, నన్నెపోగు రమేష్‌బాబు, వేంపోగు పెదమాణిక్యం, వేంపోగు చినమాణిక్యం, పాలెపోగు జాకోబు, వేంపోగు మధుబాబులు మాచర్ల తరలివెళ్లి ప్రభుత్వ విప్ పీఆర్కేను కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, ఉన్నం శంకర్, ఉమ్మినేని శివరామకృష్ణ, ఎంపీటీసీ అచ్యుతరావు, డీలర్ రత్నం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో ఓ వలంటీర్ మృతి చెందాడు. ఈ ఘటన సంతమాగులూరు మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరు గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరగగా శనివారం వెలుగు చూసింది. ఎస్సై నాగశివారెడ్డి వివరాల మేరకు.. కొమ్మాలపాడు గ్రామానికి చెందిన వైకంటి మస్తాన్ బాషా (23) వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి సమయంలో వర్షం వచ్చే సూచనలు కనిపించడంతో తన కల్లంలో ఆరబెట్టిన మిరపపై పట్టాలు కప్పేందుకు బైక్‌పై వెళ్లాడు. పట్టాలు కప్పి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో బైక్ అదుపుతప్పి సైడులోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో బాషా కిందపడిపోయి తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించాడు. బాషా బైక్‌ను ఏ వాహనమైనా ఢీకొట్టిందా అనే కోణంలో విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.